క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వరిపంటను పరిశీలిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. అకాల వర్షాలకు మండల పరిధి ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వారు వేరువేరుగా పరిశీలించి మాట్లాడారు. చేతికొచ్చిన పంటలు నేలపాలవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని సూచించారు. బాధిత రైతులకు తగిన పరిహారం అందేలా చూడాలని పేర్కొన్నారు. వారి వెంట రైతులు, నాయకులు వీరయ్య, నర్సింహగౌడ్, భిక్షపతి, నర్సింహ, యాదయ్య, బాలయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, నాయకుడు గంప శ్రీనివాస్‌గుప్తా తదితరులు ఉన్నారు.

పారదర్శకతతో ముందుకు సాగాలి

ఎంపీడీఓ బాలశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మంచాల: సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు తీరుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అందు కోసం అర్హుల ఎంపిక చాలా ప్రామాణికంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి.. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా ముందుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిజమైన అర్హులను గుర్తించినప్పుడే సంక్షేమ పథకాలు సజావుగా సాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీఓ ఉమారాణి, హౌసింగ్ ఏఈ రాంచంద్రయ్య, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే వర్షాకాలంలో అన్నదాతలను సమాయాత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించిందని అబ్దుల్లాపూర్‌మెట్ మండల వ్యవసాయ శాఖ అధికారిణి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో ఈ నెల 5 నుంచి మండల పరిధి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు వానకాలం సాగుకు తమ పొలాలను సిద్ధం చేస్తున్నారన్నారు. నకిలీ విత్తనాల బారిన పడుతూ, ప్రతిసారి వేసిన పంటలే వేయడం, అధిక దిగుబడుల సాధనకు మోతాదుకు మించిన ఎరువుల వినియోగంతో ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా వారిని చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టిందని వెల్లడించారు. సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కార మార్గం లభించనుందన్నారు. రేపటి నుంచి జూన్ 16 వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీల వద్ద నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అదే విధంగా రైతు నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఇందులో రైతులు.. కేంద్ర ప్రభుత్వం ఆధారిత పథకాల లబ్ధికోసం పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, దానికి లింకు ఉన్న ఫోన్ నంబర్‌తో మీసేవ లేదా వ్యవసాయ శాఖ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.

లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓగా పాషా



ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓగా మరోసారి పాషా ఎన్నికయ్యారు. పీఆర్‌ఓగా 2009–10 నుంచి 2025–26 వరకు 16 సార్లు వరుసగా ఆయనే నియామకం కావడం విశేషం. పీఆర్‌ఓగా ఆయన క్లబ్ నుంచి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించి, సేవలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వారం గడిచినా.. గింజ కొనలే..!

'పంటలు పండించడం ఒకెత్తు. విక్రయించడం మరో ఎత్తు. ధాన్యం రాశులతో వారం రోజులుగా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నా కొనుగోలు చేయడం లేదు' అని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తేమ, తాలు సాకుతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షంతో చేతికొచ్చిన పంట తడిసిందని ఆందోళన చెందుతున్నారు.

- కొనుగోలు కేంద్రంలో కూలీల కొరత
- ధాన్యం రాశుల వద్ద రైతుల పడిగాపులు
- అకాల వర్షంతో తడిసి ముద్దయిన వడ్లు
- ఆందోళన వ్యక్తంచేస్తున్న అన్నదాతలు



ఇబ్రహీంపట్నంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన (ఇన్‌సెట్లో) తడిసిన వడ్లను చూపుతున్న రైతు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ.. వడ్లలోని తాలును తొలగించడం, తూకం వేయడం, గోదాంలోకి తీసుకెళ్లడం, వాహనాల్లోకి ఎగుమతి, దిగుమతి లాంటి పనులను చేసేందుకు అవసరమైన లేబర్‌ను నియమించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. విషయం తెలియని రైతులు.. ధాన్యం విక్రయించేందుకు దిగుబడితో కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. ఇక్కడి వచ్చాక కానీ వారికి లేబర్ లోటు తెలియలేదు. దీంతో వారం రోజులుగా కొనుగోలు కేంద్రలోనే నిరీక్షిస్తున్నారు. సహనం కోల్పోయిన రైతన్నలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. లేబర్‌ను నియమించుకోకుండా కొనుగోలు కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నిస్తున్నారు. అసలు విషయాన్ని పక్కకు పెట్టి, తేమ, తాలు ఎక్కువ ఉందన్న సాకుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి కేంద్రలోని వడ్ల కుప్పలు తడిసిముద్దయ్యాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వడ్లు తడిసి మొలకలెత్తుతున్నాయని శనివారం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. లేబర్ వస్తున్నారని, వారు వస్తేనే కొనుగోలు సాధ్యపడుతుందని అధికారులు చెత్తులెత్తేయడంతో.. దిక్కులు చూడటం రైతుల వంతయింది.

తడిసిన ధాన్యం సేకరించండి



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. విక్రయించేందుకు తెచ్చిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కొనుగోలు కేంద్రాల్లోకి తెచ్చిన ధాన్యం తడిసిపోయిందని ఆరోపించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచడంలో కేంద్రం నిర్వాహకులు విఫలమయ్యారని విమర్శించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి, కర్షకులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, నాయకులు చెన్నకేశవులు, శ్రీనివాస్, భగవాన్‌రెడ్డి, రాఘవ, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

తేమ సాకుతో సతాయింపు



అమ్మేందుకు తెచ్చిన ధాన్యంలో తేమ, తాలు ఎక్కువుందని అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వడ్లను ఆరబోసి, తాలు తొలగించినా.. ధాన్యం సేకరించలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. లేబర్ రాలేదని చెబుతున్నారు. అకాల వర్షానికి వడ్లు తడిసి నష్టపోతున్నాం.

– ఎల్లారెడ్డి రైతు, తుర్కగూడ

నానా తంటాలు



సరిపడా కూలీలు, బస్తాలు తదితర సౌకర్యాలు సమకూర్చుకోకుండా కొనుగోలు కేంద్రం ఎందుకు ప్రారంభించారు. అమ్మేందుకు ధాన్యం తెచ్చి నానా తంటాలు పడుతున్నాం. కొద్దిపాటి తాలు ఉన్నా అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ తరువాత తాలు తొలగించినా లేబర్ లేరని సేకరించడం లేదు.

– రాంరెడ్డి రైతు, చర్లపటేల్‌గూడ

లేబర్ దొరకడంలేదు



లేబర్ దొరకక.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోంది. గతేడాది వచ్చిన కూలీలు ప్రస్తుతం అందుబాటులో లేరు. శనివారం వచ్చిన లేబర్లు.. ఇక్కడి పరిస్థితులను గమనించి వెళ్లిపోయారు. వేరే లేబర్లను మాట్లాడాము. వారు రాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– రామకృష్ణరాజు, డీసీఎంఎస్ మేనేజర్

గడువు మరోసారి పెంచేనా!



ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తున్న దరఖాస్తుదారులు(ఫైల్)

- ముగిసిన ఎల్ఆర్ఎస్ 25 శాతం రిబేట్ గడువు
- ఫీజు చెల్లించిన 4,052 ప్లాట్ల దరఖాస్తుదారులు
- ముందుకురాని 8,977 ప్లాట్ల యజమానులు

ఇబ్రహీంపట్నం: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు 25 శాతం రాయితీతో ప్రభుత్వం ఇచ్చిన గడువు శనివారంతో ముగిసింది. ముగింపు నాటికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఫీజు రూపేణా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.10.47 కోట్ల ఆదాయం సమకూరింది. పురపాలక సంఘానికి 14,101 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా.. 13,029 ప్లాట్ల దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని అధికారులు సమాచారాన్ని చేరవేశారు. నిన్నటి వరకు 4,052 మంది ఫీజు చెల్లించగా.. 8,977 మంది నుంచి స్పందన రాలేదు.

మరో అవకాశం ఉందా?

రాయితీతో కూడిన ఎల్ఆర్ఎస్ గడవును మొదట్లో మార్చి 31 వరకు ప్రభుత్వం ఇచ్చింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై అవగాహన, సాంకేతిక లోపాల కారణాలతో మొదట్లో రెండు మూడు వారాలు ఈ చెల్లింపునకు ఆటంకం కలిగింది. దీంతో ఫీజు చెల్లించాల వద్దా అనే సందిగ్ధంలో దరఖాస్తుదారులు పడ్డారు. లోపాలను సరిదిద్దుకొని ప్లాట్ల యజమానులకు అధికారులు అవగాహన కల్పించడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కాస్త ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రాయితీ గడువు ముగియడంతో ఏప్రిల్ 30 వరకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు కూడా ముగియడంతో మరో మూడు రోజుల పాటు (ఈ నెల 3 వరకు)పెంచింది. శనివారంతో రాయితీ గడవు తీరింది. మరోసారి పెంచుతారా లేదా అనేది వేచిచూడాల్సిందే.

రూ.10.47 కోట్ల ఆదాయం



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల నుంచి రూ.10.47 కోట్ల ఆదాయం ఫీజుల రూపేణా మున్సిపాలిటీకి వచ్చింది. 4,052 ప్లాట్ల దరఖాస్తుదారులు రుసం చెల్లించారు. సుమారు 8,977 ప్లాట్ల దరఖాస్తుదారులు వివిధ కారణాల వలన ఎల్ఆర్ఎస్ చెల్లించలేదని మా దృష్టికి వచ్చింది.

–రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం

వడగళ్లతో పంటలకు నష్టం

యాచారం: మండల పరిధి గ్రామాల్లో వడగళ్ల వానకు పంటలు నేలపాలయ్యాయి. శుక్రవారం రాత్రి 9 గంటలకు కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి కుర్మిద్ద, యాచారం, చౌదర్‌పల్లి, గునుగల్ గ్రామాల్లో వరి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. పూలతోటలకు నష్టం వాటిల్లింది. కాగా.. వడగళ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, అయినా అధికారులు ఎవరూ బాధిత గ్రామాల వైపు చూడలేదని రైతులు ఆరోపించారు. చేతికందొచ్చిన పంటలు దెబ్బతిని నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సార్వత్రిక సమ్మెకు తరలిరండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మంచాల: ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఎంపీడీఓ బాలశంకర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. పేద ప్రజలు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం అందించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాండు, భాస్కర్, జగన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇదే ఒరవడి కొనసాగించండి

టెన్త్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

మాడ్గుల: లక్ష్య సాధనతకు విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయుడు పర్వతాలును శనివారం కలెక్టరేట్‌లో ఎంఈఓ సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్ సన్మానించి, అభినందించారు. బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఉన్నత చదువుల్లోనూ విద్యార్థులు ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు దిక్సూచిగా మారాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, నందన, అర్చన, శ్రీలక్ష్మి, బాలు, మహేశ్, విగ్నేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే లక్ష్యసాధన



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము

ఆమనగల్లు: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. చదువుతో పాటు జీవిత నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో సాయిరాం మెడికల్స్, వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, మై విలేజ్ మాడల్ విలేజ్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రాము మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చిన్నారులు విద్యను అభ్యసించి, ఉన్నతంగా రాణించాలని చెప్పారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ఆటాపాట నేర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్‌గేమ్‌లకు దూరంగా ఉండాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిత్తరంజన్‌దాస్, ప్రిన్సిపాల్ మహమూద్, శిబిరం నిర్వాహకులు శ్రీను, భాస్కర్, యాదయ్య, భూపతిరెడ్డి, లక్ష్మణ్, కవిత, శ్యామల, అనిత, ఉదయ్, శ్రీశైలం, గోపి తదితరులు పాల్గొన్నారు.

'దేశ రక్షణకోసం సైన్యంలో చేరండి'



ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేస్తున్న రవింద్రచారి తదితరులు

హయత్‌నగర్: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 66వ ఆవిర్భావ దినోత్సవం శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ రావి నారాయణ రెడ్డి కాలనీ సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవింద్రచారి జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి యువకుడు దేశ భక్తి, క్రమశిక్షణ, సేవాగుణం కలిగి ఉండాలని దేశ రక్షణకోసం సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారు. యువకులు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, నాయకులు శేఖర్‌రెడ్డి, సంజీవ, వీరేష్, గణేశ్, భానుప్రసాద్, శ్రవణ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

- ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న బీజేపీ
- ప్రజాపాలన జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు
- అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆమనగల్లు/కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ.. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధి మైసిగండి గ్రామంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం గాంధీ, అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్‌పటేల్, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశానికి ఎంతో సేవలందించారని గుర్తు చేశారు. నేడు రాహుల్, సోనియాలు దేశం కోసం అహర్నిషలు పనిచేస్తున్నారని వెల్లడించారు.

జనరంజక పాలన

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రైతుభరోసా, సన్నాలకు రూ.500 బోనస్ తదితర పథకాలతో జనరంజక పాలన కొనసాగిస్తుందని వివరించారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. కాంగ్రెస్ సంక్షేమాభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, బీక్యానాయక్, శేఖర్‌గౌడ్, వెంకటేశ్, జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీరాం, కిషన్, సాయి, సికిందర్ ఉన్నారు.

ఆమనగల్లులో..

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగుతున్న ప్రజాపాలనను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ.. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విమర్శించారు. సంక్షేమాన్ని అడ్డుకుంటున్న పార్టీలను ప్రజలు క్షమించరన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని రైతువేదికలో 49 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని చెప్పారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, కల్వకుర్తి పరిధిలో రూ.300 కోట్లతో రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. ఆర్టీసీ డిపోకు 16 కొత్త బస్సులు వచ్చాయని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 450 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ కుసుమమాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కడ్తాల్: కడ్తాల్ మండల పరిధిలో శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి చేలు, మామిడి తోటలను వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పంట నష్టం వివరాలను పూర్తిగా సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం 82 ఎకరాల్లో వరి పంట నేలపాలయిందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కష్యప్, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.